

..ముందే తెలుసుకోవచ్చు
ఐఐటీఎం రూపొందించిన 'దామిని' యాప్‌తో పిడుగు పడటాన్ని ముందే పసిగట్టవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. - 8లో▸



గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు సన్నద్ధం
న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కలిగిన కాకతీయ యూనివర్సిటీ ఆగస్టు మాసంలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $30^0/27^0$
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

అనాథలపై వాత్సల్యం



మిషన్ వాత్సల్య ఉపకారవేతనం కింద రూ.2కోట్లకుపైగా నిధులు

- 2024 జూలై నుంచి డిసెంబర్ వరకు 883 మందికి మంజూరు
- ప్రాధాన్యతా క్రమంలో అర్హుల గుర్తింపు

సాక్షి, వరంగల్ :

అనాథ బాలురకు విద్య, వైద్య సదుపాయాలు కల్పించడంలో భాగంగా కేంద్రం అమలుచేస్తున్న 'మిషన్ వాత్సల్య' పథకం స్పాన్సర్‌షిప్ కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో 883 మంది అనాథలకు 2024 జూలై నుంచి డిసెంబర్ వరకు రూ.2,11,92,000 నిధులు మంజూరయ్యాయి. ఈ ఉపకారవేతనం కోసం ఆరు జిల్లాల్లో కలిపి పదివేలకు పైగా దరఖాస్తులొచ్చాయి. ప్రాధాన్యత క్రమంలో ఉన్న అర్హులైన 883 మంది అనాథలతోపాటు వారి గార్డియన్స్‌ల జాయింట్ బ్యాంక్ ఖాతాల్లో ఈ నిధులు అధికారులు జమ చేయనున్నారు. ప్రాధాన్యత క్రమంలో తల్లిదండ్రులు చనిపోయినవాళ్లు, హెచ్‌ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలకు, తండ్రి చనిపోయి తల్లి వేరే పెళ్లి చేసుకొని వెళ్లిపోయిన పిల్లలకు, వితంతువుల పిల్లలకు, ప్రకృతి వైపరీత్యాలకు గురైన వారు, అక్రమ రవాణా, దాడులకు గురైన వారు, బాల యాచకులు, బాల్య వివాహ బాధ్యులు అంటే 18 సంవత్సరాలలోపు బాలలకు నెలకు రూ.4,000 చొప్పున ఆర్థిక సాయం జమచేయనున్నారు. ఈ పిల్లల్లో కూడా ఎవరైనా మహాత్మా జ్యోతిబాపూలే, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో చదువుకుంటుంటే వారికి ఈ పథకం వర్తించదు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నవారికి అందనుంది. ఇటీవల కేంద్రం 2024 జూలై నుంచి డిసెంబర్ వరకు నిధులు విడుదల చేయడంతో అసలైన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో వీటిని జమచేసేలా మహిళా, శిశు సంక్షేమ విభాగాధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఒక్క వరంగల్ జిల్లాలోనే రెండువేలకు పైగా దరఖాస్తులు వస్తే వారిలో ప్రాధాన్యత క్రమంలో అర్హులుగా 97 మందిని గుర్తించారు. మిగిలిన 46 మందిని స్పాన్సర్‌షిప్ కమిటీ పరిశీలించి కలెక్టర్‌కు నివేదించిన తర్వాతనే వారి ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. ఇతర ఐదు జిల్లాల్లో ఈ స్థాయిలోనే దరఖాస్తులు రాగా అర్హులను గుర్తిస్తున్నారు.

ఈ పథకంతో ఎంతో మేలు..

మిషన్ వాత్సల్య పథకం డెవలప్‌మెంట్ గోల్స్‌తో ముడిపడి ఉంటుంది. పిల్లల రక్షణ ప్రాధాన్యతలను గుర్తించడానికి ఇదొక చక్కటి ప్రణాళిక. బాలల న్యాయ సంరక్షణ, రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు బాలల హక్కులు, అవగాహనపై 'పిల్లలను వదిలేయవద్దు' అనే నినాదంతో ఈ పథకం పనిచేస్తుంది. కోవిడ్ 19 కారణంగా ఎటువంటి ఆదరణ లేని అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూతను ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'మిషన్ వాత్సల్య' పేరుతో దీన్ని 2021 సంవత్సరంలో ప్రారంభించింది. దీనిద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 883 మంది అనాథలకు లబ్ధి చేకూరుతుందని ఆయా జిల్లాల సంక్షేమ విభాగాధికారులు అంటున్నారు.

జిల్లా	వరంగల్	హనుమకొండ	జనగామ	మహబూబాబాద్	జేఎస్.భూపాలపల్లి	ములుగు
లబ్ధిదారులు	143	216	113	227	113	71
వచ్చిన నిధులు(రూ.)	34,32,000	51,84,000	27,12,000	54,48,000	27,12,000	17,04,000

న్యూస్‌రీల్

జూన్ 17న డాక్ అదాలత్

ఖిలా వరంగల్: జూన్ 17న పోస్టల్ సర్వీస్ వినియోగదారులకు 50వ ప్రాంతీయస్థాయి డాక్ అదాలత్‌ను వీడియో కాన్ఫరెన్స్ గూగుల్ మీట్ ద్వారా నిర్వహించనున్నట్లు వరంగల్ డివిజన్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, వరంగల్ జిల్లాల పరిధిలోని వరంగల్ డివిజన్‌కు సంబంధించిన తపాలా సేవల వినియోగదారులకు ఏవైనా ఫిర్యాదులుంటే పోస్టల్ ఎన్వలప్ కవర్‌పై 50వ డాక్ అదాలత్, అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్) కె.శ్రీకాంత్, పోస్ట్‌మాస్టర్ జనరల్ హైదరాబాద్ రీజియన్, 500001 అడ్రస్ రాసి జూన్ 6వ తేదీలోగా చేరేలా పంపించాలని సూచించారు. పోస్టల్ సర్వీసులపై ఫిర్యాదులను వచ్చే నెల 17న నిర్వహించే డాక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

స్నేహ సంఘాల పరిశీలన



నర్సంపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న స్నేహ సంఘాలను రాష్ట్ర టీం సభ్యురాలు జోస్ పరిశీలించారు. చెన్నారావుపేట మండలంలోని జల్లి, ఎల్లయ్యగూడెం, ఖాదర్‌పేట గ్రామాలను మంగళవారం ఆమె సందర్శించి పరిశీలించారు. మండలంలో స్నేహ సంఘాల షెడ్యూల్ సమావేశంలో ఫోన్ ద్వారా 20 స్నేహ సంఘాలకు చెందిన 156 మంది సభ్యులతో ఎస్సై రాజేష్‌రెడ్డి సైబర్ నేరాలు, జరుగుతున్న మోసాలు, మొబైల్ వాడకంపై జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు యూనిట్ నుంచి ఏపీఎంలు అశోక్, ముక్కెర ఈశ్వర్, మండల సీసీలు కట్టయ్య, మాణిక్యం, శ్రీలత, మంజుల, సుజాత, విఓఏలు, స్నేహ సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

'వాట్సాప్'తో విద్యుత్ సమస్య పరిష్కారం

హన్మకొండ : వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావొచ్చని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ, వరంగల్ సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్లు పి.మధుసూదన్ రావు, కె.గౌతం రెడ్డి తెలిపారు. వాట్సాప్ చాట్ బాట్ ద్వారా సమస్యలను పంపే వివరాలను వారు వేర్వేరు ప్రకటనలో వివరించారు. వినియోగదారులు తమ మొబైల్ నుంచి 79016 28348 నంబర్‌కు హాయ్ అని చాట్ చేయగానే.. వెల్‌కమ్ టు టీజీ ఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్ వస్తుందని, క్రమపద్ధతిలో మన వివరాలు పొందుపరుస్తూ వెళ్తే కంప్లయింట్ నమోదవుతుందని వివరించారు. టోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి కూడా సేవలు పొందాలని సూచించారు.

జిల్లాలో భారీ వర్షం



ఖిలా వరంగల్: జిల్లాలో మంగళవారం భారీ వర్షం కురిసింది. వరంగల్ ఉర్సు గుట్ట ఏరియాలో అత్యధికంగా 64.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా.. వర్ధన్నపేట, రాయపర్తిలో అతిస్వల్పంగా 0.8 మి.మీ. నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. వరంగల్ కాశిబుగ్గ 62.5 మి.మీ, గీసుగొండ మండలం గొర్రెకుంటలో 54 మి.మీ, దుగ్గొండి 51.5, నర్సంపేట మండలం లక్నేపల్లి 41.3, వరంగల్ పైడిపెల్లి (ఏఆర్ఎస్) 37.5, నల్లబెల్లి 36.5, చెన్నారావుపేట 29.5, నల్లబెల్లి మేడపెల్లి 14.0, ఖానాపురంలోని మంగళవారిపేటలో 8.8, నెక్కొండ రెడ్లవాడ, పర్వతగిరిలో 6.0, సంగెంలో 1.05, వర్ధన్నపేట 0.8, రాయపర్తి 0.8 మి.మీ, నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వేటకు ఇక చెక్

అటవీ జంతువుల వేటపై ఉక్కుపాదం

- అటవీ ప్రాంతాల్లో నిత్య తనిఖీలు
- పాకాలలో చేపలవేటపై ఆంక్షలు
- ఇప్పటికే పలువురిపై కేసులు



స్వాధీనం చేసుకున్న ఉచ్చులు, వలలను చూపుతున్న ఎఫ్ఆర్వో రవికిరణ్(ఫైల్)

ఖానాపురం: వన్యప్రాణుల సంరక్షణకు ఫారెస్ట్ అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడుతూ అక్రమ మార్గంలో సొమ్ముచేసుకుంటున్నారు. దీంతో ఫారెస్ట్ అధికారులు వేటపై ఉక్కుపాదం మోపుతూ జంతు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. వేటను నిలువరించేందుకు కేసులు నమోదు చేస్తూ.. వేటగాళ్లను హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 80,039 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో వరంగల్ జిల్లాలో ఖానాపురం, నల్లబెల్లి మండలాల పరిధిలోనే 12,400 హెక్టార్లలో అటవీప్రాంతం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ జిల్లా గూడూరు, కొత్తగూడ మండలాలతోపాటు వరంగల్ జిల్లా ఖానాపురం, నల్లబెల్లి మండలాల పరిధిలో కలుపుకొని అడవి ఉంటుంది. వీటి పరిధిలో వేటగాళ్లు వేసవి కాలం వస్తే చాలు అటవీ జంతువులను వేటాడి విక్రయిస్తుంటారు. నీటి కోసం అటవీ జంతువులు వచ్చే వాగులు, కుంటలను టార్గెట్ చేసుకుని వేటగాళ్లు వాటిని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈక్రమంలో అటవీ జంతువులను వేటగాళ్ల నుంచి రక్షించడానికి వేసవి కాలంలో భద్రతా చర్యలు చేపడుతున్నారు.

వేటగాళ్ల ఉచ్చులు స్వాధీనం..

ఖానాపురం మండలంలోని పాకాలతోపాటు బండమీదిమామిడితండా, నాజీతండా, చిలుకమ్మనగర్‌తోపాటు కీర్యతండా అటవీప్రాంతాల శివార్లలో ఉచ్చులతో అటవీజంతువుల వేట సాగుతున్నట్లు వినికిడి. దీంతో ఆయా గ్రామాల వైపు ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఇటీవల కాలంలో తనిఖీలు ముమ్మరం చేశారు. తనిఖీల సమయంలో అధికారులు భారీగా అటవీజంతువులను వేటాడటానికి ఉపయోగించే ఉచ్చులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మార్చి 19న అటవీజంతువును వేటాడి తరలిస్తుండగా పట్టుబడిన చిలుకమ్మనగర్‌కు చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు.

చేపల వేటపై ఆంక్షలు..

పాకాలలో ఎలాంటి అనుమతులు లేకుండా కొద్ది సంవత్సరాలుగా చేపలవేట సాగుతుంది. ఖానాపురంతోపాటు నర్సంపేట ప్రాంతాలకు చెందిన పలువురు మత్స్యకారులు చేపలవేటను కొనసాగిస్తున్నారు. అధికారులకు తెలియకుండా రాత్రి వేళల్లో తెప్పల సహకారంతో చెరువుల్లోకి వెళ్లి వలలతో చేపలు పడుతున్నారు. చేపలు పట్టే సమయంలో పలువురు మత్స్యకారులపై మొసళ్లు దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. మంచినీటి సరస్సుల్లో దేశంలోనే పేరుగాంచిన పాకాల సరస్సులో చేపల వేటపై ఫారెస్ట్ అధికారులు ఆంక్షలు విధించారు. చేపలవేట సాగకుండా మత్స్యకారులకు చెందిన వలలను స్వాధీనం చేసుకున్నారు. చేపలవేట సాగకుండా పటిష్టంగా చర్యలు చేపడుతున్నారు.

వేటాడితే చర్యలు తప్పవు



అటవీజంతువులను వేటాడటం చట్టరీత్యా నేరం. వన్యప్రాణి సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. జంతువులను వేటాడుతూ పట్టుబడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాం. అటవీజంతువుల సంరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలి. జంతువులను వేటాడినా, ప్రాణాలు తీసినా ఊరుకునేది లేదు.

- పుప్పాల రవికిరణ్, ఎఫ్ఆర్వో, నర్సంపేట

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఖానాపురం: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన చైతన్య మండల సమాఖ్య వార్షిక మహాసభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా రుణాలు తీసుకొని పలు వ్యాపారాలు చేస్తూ ఆర్థిక అభివృద్ధి చెందుతున్న మహిళలను సన్మానించారు. ప్రభుత్వం నుంచి సంఘానికి మంజూరైన రూ.10.20 కోట్ల చెక్కును అందజేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, ఏపీడీ రేణుకాదేవి, డీపీఎం అనిత, ఎంపీడీఓ సునీల్‌కుమార్, ఏపీఎంలు కందిక సుధాకర్, వేణు, అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి జ్యోతి, కోశాధికారి కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతి చేయాలని రాస్తారోకో



ధాన్యం ట్రాక్టర్లతో రాస్తారోకో చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు



మిల్లర్‌తో మాట్లాడుతున్న అధికారులు

- అధికారులు చెప్పినా.. నిరాకరించిన మిల్లర్

ఖానాపురం: మిల్లు వద్దకు చేరిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఖానాపురం శివారులో మంగళవారం రైతులు ధాన్యం ట్రాక్టర్లతో రాస్తారోకో చేపట్టారు. రైతుల రాస్తారోకోకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సైలు రఘుపతి, పవన్ అక్కడకు చేరుకొని రైతులు, బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి రాస్తారోకో విరమింపజేశారు. సివిల్ సప్లయీస్ డీటీ సంధ్యారాణి, డీటీ రాజారేణుక, ఆర్ఐ స్వామి, ఏఎస్ఓ సుగుణ.. ధాన్యం దిగుమతి చేయించేందుకు మిల్లర్‌తో చర్చించారు. అయితే.. మిల్లులో స్థలం లేదని, తాను దిగుమతి చేసుకోనంటూ మిల్లర్ నిరాకరించారు. బుధరావుపేటలోని రైతు ఉత్పత్తిదారుల సంఘానికి చెందిన గోదాంలో దిగుమతి చేయించాలని సూచించినా మిల్లర్ వినిపించుకోలేదు. దీంతో రైతుల ధాన్యం దిగుమతి కాకుండా మిల్లు వద్దనే నిలిచిపోయింది. మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాసగౌడ్‌లు మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికార పార్టీ నాయకులు మిల్లర్లతో కుమ్మక్కు కావడంతోనే రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నారని ఆరోపించారు. సోమయ్య, సుమన్, అశోక్, బాలు, రైతులు యాకయ్య, నాగరాజు, ఈర్యానాయక్, కుమారస్వామి, ఎల్లస్వామి, వెంకన్న, భీమానాయక్ పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ



మాట్లాడుతున్న చంద్రశేఖర్ తివారీ

గీసుకొండ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు గెలుపొందేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీజేపీ సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా సంస్థాగత సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, ఆరూరి రమేష్, వన్నాల శ్రీరాములు, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, రత్నం,సతీష్‌షా, వల్లాల వెంకటరమణ, కంభంపాటి పుల్లారావు, బాకం హరిశంకర్ పాల్గొన్నారు.

చిన్నకొర్పోలులో వికటించిన వైద్యం

- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- తెలంగాణ వైద్య మండలి తనిఖీలు



నకిలీ వైద్యుడిని విచారిస్తున్న అధికారులు

నెక్కొండ: వైద్యం వికటించి ప్రాణపాయం నుంచి ఓ బాధితుడు బయటపడ్డ ఘటన మండలంలోని చిన్నకొర్పోలు శివారు చెరువుముందరి తండాలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యులు జిల్లా తెలంగాణ వైద్యమండలి దృష్టికి తీసుకెళ్లడంతో సూరిపల్లిలోని మహేశ్వర్ క్లినిక్, మండలం కేంద్రంలోని లావణ్య, రుద్ర, అమ్మ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ఆజీర్మా తులస్య అలియాస్ తుల్సా ఏప్రిల్ 7న ఒళ్లు నొప్పులతో నీరసంగా ఉండడంతో చిన్నకొర్పోలులో ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ నిర్వహిస్తున్న బర్మావత్ మోహన్‌ను సంప్రదించాడు. దీంతో తొంటికి ఇంజక్షన్ వేయగా అది గడ్డ కట్టింది. తీవ్రనొప్పి, జ్వరం రావడంతో మళ్లీ సంప్రదించాడు. వివిధ రకాల ఇంజక్షన్లతోపాటు సెలైన్లు పెట్టి చికిత్స చేశాడు. సమస్య జఠిలం కావడంతో కుటుంబ సభ్యులు 12న నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో అత్యవసర పరిస్థితిలో రెండుసార్లు ఆపరేషన్ చేసి తొంటి, తొడ, కాలికి సోకిన ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించారు. మళ్లీ ఇన్‌ఫెక్షన్ సోకడంతో తొర్రూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో మళ్లీ ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం తులస్య ఆరోగ్యం కుదుట పడింది. కాగా, నకిలీ వైద్యుడు మోహన్‌పై చర్య తీసుకోవాలని బాధితుడి భార్య బుజ్జి తన బంధువుల సాయంతో పోలీస్ స్టేషన్‌తోపాటు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కి ఫిర్యాదు చేసింది. విచారణలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదివిన మోహన్ మూడేళ్లుగా వైద్యం చేస్తున్నాడని తేలింది. సూరిపల్లి మహేశ్వర్ క్లినిక్ సెంటర్ నిర్వాహకుడు ఎం.రమేష్, మండల కేంద్రంలోని అమ్మ, రుద్ర, లావణ్య ఫస్ట్‌ఎయిడ్ నిర్వాహకులు డి.అశోక్, బి.రవి, ఎం.రమేష్ ఆస్పత్రుల్లో కాంపౌండర్లుగా పనిచేసి, చట్టవిరుద్ధంగా చికిత్స చేస్తున్నట్లు గుర్తించారు. మోహన్‌తోపాటు మరో నలుగురిపై కేసునమోదు చేశారు. తనిఖీలో జిల్లా హెచ్ఆర్‌డీఏ అధ్యక్షుడు, ఐఎంఏ ఆంటీ క్వాకరీ కమిటీ సెక్రటరీ డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ నవీన్, ఎస్సై మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

- కలెక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకమైందని కలెక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో లైసెన్స్ సర్వేయర్లకు సర్వే సెటిల్‌మెంట్ భూ రికార్డుల శాఖ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో మంగళవారం కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి రోజు భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో 6 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లను నియమించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 315 మంది సర్వేయర్లకు సోమవారం నుంచి 50 రోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైన వారినే సర్వేయర్లుగా నియమిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు శిక్షణ మెటీరియల్ కిట్‌ను అందించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, ల్యాండ్ సర్వే అధికారి దేవరాజు, డీఐ నాగభూషణం, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

కార్యక్రమాల అమలులో కలెక్టర్లు కీలకం

ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కలెక్టర్లు పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కలెక్టర్లు, అధికారులతో హైదరాబాద్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ నుంచి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యశారద, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలి

జిల్లాలోని ప్రభుత్వ హాస్టల్స్, రెసిడెడియల్ స్కూల్స్‌లో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సత్యశారద ఆర్సీఓలను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై ఆర్సీఓలు, ప్రిన్సిపాల్స్‌తో మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు సురక్షితంగా, ఆరోగ్యంగా, గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. జూన్ 12న పాఠశాలల ప్రారంభోత్సవానికి ముందే యూనిఫాం సిద్ధంగా ఉండాలన్నారు. హాస్టల్‌లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థుల నుంచి అభిప్రాయాలు తీసుకుని వారి అవసరాలను గుర్తించాలన్నారు. హాస్టల్స్‌లో కంప్లైంట్స్ బాక్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

విత్తన కంపెనీ గోదాం పరిశీలన

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని రాసి సీడ్స్ కంపెనీ గోదాంను మంగళవారం కలెక్టర్ సత్యశారద పరిశీలించారు. గోదాం స్టోరేజి పాయింట్ నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, ఎస్సీ వెల్ఫేర్ అధికారి భాగ్యలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సౌజన్య, మైనార్టీ వెల్ఫేర్ అధికారి రమేష్, ల్యాండ్ సర్వే అధికారి దేవరాజు, డీఐ నాగభూషణం, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఏడీఏ దామోదర్, ఏఓ హరిప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు

విద్యారణ్యపురి: వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ జారీ చేసింది. రూ.200 కోట్లతో ఒక్కో పాఠశాలను నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చారు.

జిల్లాకు చేరిన మాల్దీవుల అధికారుల బృందం

- ప్రభుత్వ పథకాల అమలుపై అధ్యయనం

న్యూశాయంపేట: మాల్దీవుల రిపబ్లిక్ నుంచి అకౌంట్స్ ఆఫీసర్లు, ఆడిటర్లు, నగర కౌన్సిల్, అటో కౌన్సిల్ అధికారుల బృందం అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చింది. రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ఆడిట్, అభివృద్ధి కార్యకలాపాల తీరును ఈ బృందం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనుంది. మూడు రోజులపాటు జిల్లా పర్యటించనున్న ఈ బృందం.. మాల్దీవ్స్ డైరెక్టర్ జనరల్ ఆడమ్ షరీఫ్ అహ్మద్, డైరెక్టర్ అబ్దుల్లా రషీద్ సారథ్యంలో మొదటి రోజు మంగళవారం బృంద సభ్యులు కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారదను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, జిల్లా చారిత్రక నేపథ్యాన్ని సభ్యులకు కలెక్టర్ సత్యశారద వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, డీపీఓ కల్పన, జిల్లా ఆడిట్ అధికారి దేవేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక రైలు



కిశోర్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా వివిధ తీర్థ యాత్రలకు ప్రత్యేక రైళ్లు నడిపించనున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 14 నుంచి జూలై 13వ తేదీ వరకు రెండు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

ప్యాకేజీ–1 వివరాలు..

గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర జూన్ 14న ప్రారంభమై 22వ తేదీ వరకు ఉంటుంది.

ప్యాకేజీ–2 వివరాలు..

సికింద్రాబాద్ నుంచి వయా కామారెడ్డి, నిజామాబాద్ మీదుగా ఐదు జ్యోతిర్లింగ యాత్ర రైలు జూలై 5వ తేదీన ప్రారంభమై 13వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9701360701, 9281030712, 9281495845, 9281030749, 9281030750 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

పుష్కరాల విజయవంతానికి కృషి చేసిన

ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని సరస్వతీనది పుష్కరాల విజయవంతానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, భక్తులకు అభినందనలు తెలిపారు. విధుల్లో నిబద్ధత, సమగ్ర ప్రణాళిక, అవిశ్రాంత కృషితో లక్షలాది మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించారన్నారు. పుష్కరాల సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులను అభినందించారు. సమష్టి బాధ్యతతో నిర్వహించిన ఈ పుష్కరాలు మన భవిష్యత్ కార్యాచరణకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు సన్నద్ధం..

ఆగస్టు 19వ తేదీతో కేయూకు 50 వసంతాలు

- అందరి సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధి
- ఈసారి బ్లాక్‌గ్రాంట్స్ పెంచిన ప్రభుత్వం
- అకడమిక్, పరిశోధనల పరంగా ముందుకు
- రూసా నిధులతో కే హబ్ అందుబాటులోకి..
- భూముల పరిరక్షణకు ప్రహరీ నిర్మాణం
- వీసీ కె.ప్రతాప్‌రెడ్డి వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, పక్కన రిజిస్ట్రార్ వి. రామచంద్రం

కేయూ క్యాంపస్: న్యాక్ ఏప్లస్ గ్రేడ్ కలిగిన కాకతీయ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు సన్నద్ధమవుతోంది. ఈ ఏడాది ఆగస్టు 19 వతేదీతో 50 వసంతాల్లోకి అడుగిడబోతోంది. ఈమేరకు వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన ఏడు నెలల అనంతరం తొలిసారి మంగళవారం కేయూ సెనేట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను వీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన, చేపట్టబోయే పలు అభివృద్ధి అంశాలను వివరించారు. ప్రధానంగా అకడమిక్, పరిశోధనల పరంగా వర్సిటీని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వర్క్‌షాప్స్, డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, సెమినార్స్ నిర్వహిస్తున్నామన్నారు. రూసా నిధులతో యూనివర్సిటీలోని కే హబ్‌లో ఆరు రీసెర్చ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. 65మందికి ప్రాజెక్టు ఫెల్లోస్ అవకాశం లభించిందని, ఇంజనీరింగ్, ఫార్మసీ విభాగాల్లో స్కిల్స్ ఆధారిత కోర్సులను కూడా ప్రారంభిస్తామన్నారు. కేయూలో ఈఏడాది ఆగస్టు 19నుంచి గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టాలని యోచిస్తున్నామన్నారు. మూడురోజులు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ కూడా నిర్వహిస్తామన్నారు. అందుకు ముందు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యూనివర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. పూర్వ విద్యార్థులు కూడా గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాల్లో భాగస్వాములయ్యేలా కార్యక్రమ ప్రణాళిక రూపొందించబోతున్నామన్నారు. కొత్త కోర్సుల రూపకల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఉపాధికల్పన కోర్సులపై కూడా దృష్టిసారిస్తామన్నారు. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో కేయూకు బ్లాక్‌గ్రాంట్ గతంకంటే సుమారు రూ.9కోట్లకుపైగా పెంపుదలచేసి బడ్జెట్‌లో రూ. 144 కోట్లు కేటాయించిందన్నారు. అలాగే, యూనివర్సిటీలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 50కోట్లు కేటాయిందన్నారు.

విద్యార్థులకు హాస్టల్ భవనాలు

కేయూలో 4వేలకు పైగా పీజీ తదితర కోర్సుల విద్యార్థులు ఉన్నారు. అయితే అందుకు సరిపడా హాస్టల్స్ అవసరం ఉంది. గర్ల్స్, బాయ్స్‌కు హాస్టల్ భవనాలు అవసరం ఉంది. వాటి నిర్మాణాల కోసం కృషి చేస్తున్నామని వీసీ తెలిపారు. అలాగే, మహిళా ఇంజనీరింగ్ అకడమిక్ బ్లాక్‌ను కూడా నిర్మిస్తామన్నారు.

జూలై 7న కేయూ స్నాతకోత్సవం

కేయూ 23వ స్నాతకోత్సవం జూలై 7న నిర్వహించబోతున్నామని, ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కూడా రానున్నారని వీసీ వెల్లడించారు. వివిధ కోర్సుల్లో 546 మంది అభ్యర్థులకు గోల్డ్ మెడల్స్, 573 మంది అభ్యర్థులకు డాక్టరేట్లు ప్రదానం చేస్తారని తెలిపారు.

కేయూ భూముల పరిరక్షణకు ప్రహరీ నిర్మాణం

కాకతీయ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు రూ. 20 కోట్లతో ప్రహరీ నిర్మించబోతున్నాం. ఇప్పటికే విజిలెన్స్, మున్సిపల్ అధికారుల సమక్షంలో రెవెన్యూ అధికారుల సర్వే పూర్తయింది. అధికారుల నుంచి ఫైనల్ రిపోర్టు రావాల్సింది. కబ్జాదారులపై కూడా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

ఉద్యోగులు సమయపాలన పాటించేలా హాజరు..

కేయూలో అధ్యాపకులు, ఉద్యోగులు సమయపాలన పాటించేలా ఈఏడాది జూలైలో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ఏర్పాటు చేయాలనే యోచన ఉందని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వీసీ వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ వి. రామచంద్రం పాల్గొన్నారు.

పిడుగుపాటు.. ముందే తెలుసుకోవచ్చు

- 'దామిని' యాప్ ద్వారా ప్రమాదాన్ని ముందే పసిగట్టొచ్చు
- ఎరుపు, పసుపు, నీలి రంగుల ద్వారా ఎంత సమయంలో పిడుగు పడుతుందనే సమాచారం
- ప్లేస్టోర్‌లో అందుబాటులో' దామిని' యాప్



మీకు తెలుసా..?

సంగెం: అకాల వర్షాలు, వానాకాలంలో పిడుగులు పడి మూగజీవాలు, ప్రజలు మృతి చెందడం మనం చూస్తుంటాం. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ప్రజాజీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు ఉరుములతో కూడిన వర్షాలతో పాటు పిడుగుపాటుతో ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతూనే ఉంది. ఏటా పిడుగుపాటుకు గురై అధిక సంఖ్యలో మూగజీవాలు, ఎక్కువ సంఖ్యలో ప్రజలు ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో పిడుగు పాటుపై పరిశోధనలు చేసిన భారత వాతావరణ శాఖ పిడుగు పడడాన్ని ముందే పసిగట్టేందుకు ఓ యాప్‌ను ఆవిష్కరించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ(ఐఐటీఎం) 'దామిని' యాప్‌ను రూపొందించింది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

స్మార్ట్‌ఫోన్ కలిగిన ప్రతీ ఒక్కరు ప్లేస్టోర్ నుంచి 'దామిని' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్ తెరిచి పేరు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్ నమోదు చేయాలి. అనంతరం జీపీఎస్ లోకేషన్ కోసం యాప్‌ను వినియోగించే సమయంలో మీ ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో, లేదో మూడు రంగుల్లో చూపిస్తుంది.

ఎరుపు రంగు..

- మీరు ఉన్న ప్రాంతంలో మరో 7 నిమిషాల వ్యవధిలో పిడుగుపడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి వస్తుంది.

పసుపు రంగు..

- మీరు ఉన్న ప్రాంతంలో 10 నుంచి 15 నిమిషాల లోపు పిడుగుపడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ పసుపు రంగుగా మారుతుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

- నల్ల మబ్బులు ఆకాశమంతటా విస్తరించి భారీ వర్షం కురుస్తున్న సమయంలో రైతులు పంట పొలాల్లో తిరగకుండా ఏవైనా భవనాల్లోకి లేక తాము ఉన్న చోటనే మోకాళ్లపై కూర్చుని రెండు చెవులు మూసుకోవాలి.
- బహిరంగ ప్రదేశాల్లో పిడుగుపడే అవకాశం ఎక్కువ ఉంటుంది. మొబైల్ సిగ్నల్స్ పిడుగుపడే అవకాశాన్ని ఎక్కువ కల్పిస్తాయి. మబ్బులు ఉన్న సమయంలో పంట పొలాల్లో మొబైల్ వినియోగించకపోవడం మంచిది.
- విద్యుత్ స్తంభాలు, సెల్‌ఫోన్ టవర్లు, బోర్‌పంప్ సెట్లకు దూరంగా ఉండాలి. బోరు మోటార్ల నుంచి వచ్చే నీటిని కూడా ఆ సమయంలో వినియోగించొద్దు.
- పశువులను మేతకు బయటకు తీసుకెళ్లకుండా పాకలోనే ఉంచాలి.
- పిడుగులు పొడవైన చెట్ల మీద పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే వర్షం కురిసే సమయంలో చెట్ల కింద ఉండొద్దు.

నీలం రంగు..

- మీరు ఉన్న ప్రాంతంలో 18 నుంచి 25 నిమిషాల లోపు పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ నీలం రంగులో కనిపిస్తుంది.

రైల్వే పెన్షనర్లు డిజిటల్ సేవలకు అప్‌డేట్ కావాలి

- ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ ప్రెసిడెంట్ శ్రీధర్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న శ్రీధర్

కాజీపేట రూరల్ : రైల్వే పెన్షనర్లకు హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (హెచ్‌ఆర్‌ఎంఎస్)– ఈ పాస్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్) డిజిటల్ సేవలు ప్రవేశపెట్టినట్లు ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ నేషనల్ (ఏఐఆర్‌ఆర్‌ఎఫ్) ప్రెసిడెంట్ ఎస్.శ్రీధర్ అన్నారు. కాజీపేట జంక్షన్‌లోని రైల్వే కమ్యూనిటీహాల్‌లో మంగళవారం రైల్వే పెన్షనర్ల శ్రేయస్సు దృష్ట్యా డిజిటల్ లిట్రసీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించేందుకు డిజిటల్ అవగాహన నిర్వహించినట్లు తెలిపారు. సికింద్రాబాద్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రస్నాదేవి మాట్లాడుతూ రైల్వే పెన్షనర్స్ హెచ్ఆర్ఎంఎస్ ఈ –పాస్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. కాజీపేట రైల్వే ఆస్పత్రి ఏసీఎంఎస్ హరిబాబు.. హెచ్‌ఎంఐఎస్ వినియోగంలో ఉన్న లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఎస్.బాబురావు, పి.వెంకటేశ్వర్లు, డివిజన్ ట్రెజరర్ డి.రాజేశ్వర్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సంగమయ్య, సిహెచ్.కొమ్మాలు, జె.కె.మల్లయ్య, సుధాకర్, యాదగిరి, రజాలి, ఆర్.వెంకటేశ్వర్లు, రామారావు, బి.సమ్మయ్య, ఆగయ్య, డి.మల్లేశం, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, బెల్లంపల్లి, జమ్మికుంట, రామగుండం, కేసముద్రం,డోర్నకల్, ఖమ్మం, వరంగల్, కాజీపేట నుంచి 300 మంది రైల్వే రిటైర్డ్ పెన్షనర్లు పాల్గొన్నారు.

ఆగస్టు 19 నుంచి కేయూలో 'సైన్స్ కాంగ్రెస్ '



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, సైన్స్ కాంగ్రెస్ బాధ్యులు, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఆగస్టు 19 నుంచి 21వతేదీ వరకు మూడురోజులు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించబోతున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను కేయూలోని సెనేట్‌హాల్‌లో మంగళవారం వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ చైర్మన్, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ సిహెచ్. మోహన్‌రావు, అకాడమీ బాధ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అకాడమీ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 19, 20, 21తేదీల్లో మూడురోజుల సమావేశాల్లో రెండు ప్లీనరీ సమావేశాలతోపాటుగారెండు సబ్‌థీమ్స్, నాలుగు స్పెషల్‌థీమ్స్‌తో సమాంతరంగా సెషన్లు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులకు సైంటిస్టులతో ఇంటరాక్షన్ కూడా నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం ఈ సైన్స్ కాంగ్రెస్ జరగబోతుండడం ఇది రెండోది. 2018లో వరంగల్ నిట్‌లో నిర్వహించారు.ఈసారి కేయూలో జరగబోయే సైన్స్‌కాంగ్రెస్‌కు వెయ్యి మందికిపైగా ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వి. రామచంద్రం, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ సెక్రటరీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీ వడ్డె రవీందర్, ప్రొఫెసర్ ఎస్ఎం రెడ్డి, ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్

హన్మకొండ కల్చరల్ : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో రెగ్యులర్ ఎంఏ తెలుగుకోర్సులో ప్రవేశం పొందడానికి నోటిఫికేషన్ విడుదల చేశామని పీఠాధిపతి గడ్డం వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హంటర్ రోడ్‌లోని వరంగల్ ప్రాంగణంలో జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 2025–2026 విద్యా సంవత్సరానికి ఎంఏ తెలుగుకోర్సులో ప్రవేశం పొందడానికి ఆసక్తి గల విద్యార్థులు తెలుగు విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. teluguuniversity.ac.in, WWW.pstucet.org వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపర్చామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను 2025 జూన్24లోగా సాధారణ రుసుముతో, 2025జూన్30 వరకు ఆలస్య రుసుముతో సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9989417299, 9989139136 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్..

- ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాకు చెందిన వెంకటి రామ్ గోద్మారే, ఇదే రాష్ట్రం యవత్మాల్ జిల్లా ఇందిరానగర్‌కు చెందిన షెరాలీ సయ్యద్ మోతీ పరిచయస్తులు. బోళ్ల (స్టీల్, అల్యూమినియం గిన్నెలు) వ్యాపారైన గోద్మారే.. ఆ సామగ్రి అమ్మకంతో వచ్చిన డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా 2008 నుంచి తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 20కి పైగా చోరీలకు పాల్పడ్డాడు. షెరాలీ సయ్యద్ మోతీ కూడా జల్సాలకు అలవాటు పడి అక్కడి సుపారీ గ్యాంగ్‌లో చేరాడు. 2019లో ఓ మర్డర్ కేసులో మహారాష్ట్రలోని అమరావతి జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో వెంకటి గోద్మారేతో పరిచయం ఏర్పడింది. దీంతో గోద్మారే సలహా మేరకు 2022లో ఇద్దరు కలిసి తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడ్డారు. రాయ్‌పూర్ జైలుకు వెళ్లి తిరిగి మే 01, 2024న విడుదలయ్యారు. ప్రస్తుతం వారు బెయిల్‌పై ఉండడంతో జల్సాలు, లాయర్‌కు డబ్బులు ఇవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మళ్లీ ఈనెల 11న రైలులో వరంగల్‌కు చేరుకుని నగరంలోని బ్యాంకు కాలనీ –2లోని శాంతినగర్‌లో బయ్య స్వామి అనే వ్యక్తి ఇంటి తాళం పగులకొట్టి 9 తులాల బంగారం, రూ. వెయ్యి నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను గాలించి పట్టుకున్నారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన మట్టెవాడ ఎస్‌హెచ్‌ఓ గోపి, ఎస్సై నవీన్‌కుమార్, కానిస్టేబుళ్లు హరికాంత్, మీర్ మహ్మద్ అలీ, రాజేశ్,ఏఏఓ మహ్మద్ సల్మాన్ పాషా, నగేశ్‌రెడ్డి, ప్రవీణ్‌ను ఏసీపీ అభినందించారు.

కార్పొరేట్ కంపెనీలతో రైతు పరిస్థితి దుర్భరం



ర్యాలీలో రైతు సంఘం నాయకులు, రైతులు

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

ఖిలా వరంగల్: రైతులు గౌరవం కోల్పోయారని, పంట సాగు మొత్తం కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లడంతో రైతులు దుర్భర జీవితం ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సాయి ఫంక్షన్ హాల్ ఎంసీపీఐ నాయకుడు మోర్తాల చందర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు గతంలో ఇంట్లో విత్తనాలు తయారు చేసుకునేదని, ఇప్పుడు పత్తి విత్తనాలు కావాలంటే నగదు పట్టుకుని విత్తన షాపులకు వెళ్లాలని, అక్కడ నాణ్యమైన విత్తనాలు లభించడం లేదన్నారు. రానున్న రోజుల్లో కార్పొరేట్ చేతుల్లో ఉన్న విత్తన కంపెనీల ప్రభావాన్ని తగ్గించి రైతులకు నేరుగా సహాయ సహకారాలతోపాటు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాడాలి

రామన్నపేట : కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎంసీపీఐ రాష్ట్ర ప్రథమ మహాసభల్లో భాగంగా రెండో రోజు మంగళవారం నగరంలోని పోచమ్మమైదాన్‌లో నిర్వహించిన రైతు ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు, నాయకులు చంద్రశేఖర్, సింగతి సాంబయ్య, పానుగంటి నర్సయ్య, బాషిపాక రమేశ్, కుస సంపత్, బల్సుకూరి నర్సయ్య, వీరమల్లు రాజు, మాదం తిరుపతి, తాటికొండ రవి, మాలోత్ రాజేశ్ నాయక్, రాకేశ్, సూరి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



భక్తులు లేక వెలవెలబోతున్న కాళేశ్వరాలయం ప్రధాన గోపురం

'ఖాళీ'శ్వరమాయే!

కాళేశ్వరం: ఇసుకేస్తే రాలనంత జనం..త్రివేణి సంగమ తీరాల్లో స్నానాలకు పోటెత్తిన భక్తులు..కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్. రద్దీగా మారిన ప్రధాన రహదారులు..వేల వాహనాలతో కిక్కిరిసిన పార్కింగ్ స్థలాలు. ఇవన్నీ ఈ నెల 15 నుంచి 26 వరకు నిర్వహించిన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని సరస్వతీనది పుష్కరాల సమయంలో వినిపించిన దృశ్యాలు. ఆ జనహోరు సోమవారంతో ముగిసింది. పుష్కరాలు ముగియడంతో పన్నెండు రోజులపాటు జనకళ సంతరించుకున్న తీరప్రాంతాలు, రద్దీతో కనిపించిన రహదారులు, ఆలయ పరిసరాలు మంగళవారం ఇలా వెలవెలబోతూ 'ఖాళీ'శ్వరంగా దర్శనమిచ్చింది. సుమారు 12 రోజుల పాటు 15లక్షలకుపైగా భక్తజనం పుష్కర స్నానాలు చేసి, ముక్తీశ్వరాయంలో దర్శనాలు చేసుకున్నారు.



భక్తులు లేని సరస్వతి ఘాట్

కాసుల పెట్టె గలగల..


- ఆర్టీసీ పుష్కర ఆదాయం రూ.6.29 కోట్లు
- 5,047 ట్రిప్పుల ద్వారా 4,36,189 భక్తుల చేరవేత

ప్రత్యేక బస్సుల వివరాలు, వచ్చిన ఆదాయం (రూ.లలో)..

తేదీ	ట్రిప్పులు	భక్తులు	ఆదాయం
15న	166	13,877	14,14,083
16న	212	15,410	19,15,312
17న	270	21,999	28,89,795
18న	439	39,597	5353158
19న	364	34,237	44,81,904
20న	320	26,643	35,86,130
21న	300	24,816	33,43,466
22న	376	31,612	45,02,242
23న	461	45,609	63,01,693
24న	680	61,237	92,33,941
25న	780	64,454	1,07,95,477
26న	679	56,698	91,77,259

హన్మకొండ: సరస్వతీనది పుష్కరాలకు టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ ప్రత్యేక బస్సుల నడిపి రూ.రూ.6,29,94,460 ఆదాయం రాబట్టుకుంది. ఈ నెల 15 నుంచి 26 వరకు సరస్వతినదీ పుష్కరాలకు వరంగల్ రీజియన్‌లోని ఆయా బస్ స్టేషన్‌ల నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా భక్తులను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం చేరవేసింది. 5,047 ట్రిప్పుల ద్వారా 6,28,586 కిలో మీటర్లు బస్సులు తిప్పి 4,36,189 ప్రయాణికులను చేరవేసి రూ.6,29,94,460 ఆదాయం పొందింది. 12 రోజుల పాటు సురక్షితంగా బస్సులు నడిపి క్షేమంగా భక్తులను చేరవేసింది. అధికారులు బస్ స్టేషన్‌లో ఉండి భక్తుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు సమకూర్చుకుంటూ వెంట వెంటనే చేరవేశారు.

2 నుంచి స్లాట్ బుకింగ్



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఫణిందర్

కొడకండ్ల : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ వచ్చే నెల 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ డి.ఫణిందర్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కొడకండ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో కూడా ఆస్తులు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి స్లాట్ బుకింగ్ విధానం అమలవుతుందని, ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ పూర్తి చేసి దస్తావేజులు అందజేస్తామన్నారు. రోజుకు 48 స్లాట్‌లు అందుబాటులో ఉంటాయని, స్లాట్ బుకింగ్ తమ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ KU దబ్బాలు కెనాల్ నుండి 900 మీ॥దూ॥లో 80 ఫీ॥ రోడ్డు ప్లాట్స్ నాలా కన్వర్షన్ విత్ రిజిస్ట్రేషన్ ప్లాట్స్, రెసిడెన్షియల్ జోన్, లోన్ సౌకర్యం, గ॥ రూ॥12000. 9182538110, 8341175144. [WA-7567]

TO-LET

■ TO-LET వరంగల్ హంటర్ రోడ్, సంతోషిమాత గుడి వెనుకాల 1BHK ఇండిపెండెంట్ హౌస్ కిరాయికి ఇవ్వబడును. సంప్ర॥ 9849713398. [SCA25004246]

SERVICES

LOSS OF CERTIFICATES

■ GADDAM RAJANI, D/o. GADDAM LAXMAIAH, R/o. H.No.145/b, Vikas Nagar, Jangaon జిల్లా గార్లవి Original ఇంటర్మీడియట్ మెమో & Original SSC మెమో 2 తీసుకొని జనగాం బస్టాండ్‌కి వెళ్తుండగా ఎక్కడో పడిపోయాయి దొరికిన వారు ఈ నెంబర్‌కి తెలుపగలరు. Cell: +919701641948 [SCA25004290]

BUSINESS OFFER

■ వెజ్ & నాన్‌వెజ్ పచ్చళ్ళు బిజినెస్ ఆఫర్ ఒకేసారి పెట్టుబడి రూ॥ ఒక లక్షతో 3 Yrs. అగ్రిమెంట్ + నెలకు రూ॥ 10 వేలు శాలరీ + బిజినెస్‌పై upto 30% డైలీ ఆదాయం. శ్రీ విజయలక్ష్మి పికిల్ మార్ట్-81439 09459. [SCA 25004291]

CHANGE OF NAME

■ I, the undersigned GADEGANI SRINU, (New name), previously called GADAGAANI SRINIVAS (Old Name) and Residing H.No. 3-6/2, Madannapet Village, Narsampet Mandal Warangal District, Telangana State, India, and solemnly declare. [SCA25004278]

CHANGE OF NAME

■ I, the undersigned GADEGANI SUNITHA, (New name), previously called GADAGAANI SUNITHA (Old Name) and Residing at H.No. 3-6/2, Madannapet Village, Narsampet Mandal Warangal District, Telangana State, India, and solemnly declare. [SCA25004279]

WANTED

■ డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసిన యువతీ/యువకులకు రామప్ప కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులను స్టడీ అవర్స్ మరియు కళాశాల మెయింటెనెన్స్ కోసం Male వార్డెన్లు (12) Female వార్డెన్లు (4) మరియు ట్యూటర్లు (8) కావలెను. జీతంతో పాటు ఉచిత వసతి మరియు భోజనం కల్పించబడును. సంప్ర॥ 6301274545. [WA-20]

■ ప్రముఖ అకాడమీలో పేపర్ డిస్ట్రిబ్యూషన్ చేయడం కోసం పదవ తరగతి పూర్తి చేసిన వారు కావలెను. నెలకు జీతం 12 వేలు. సంప్ర॥ 7816067698. [WA-21]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం TG No.1 Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పనిబేబికేర్‌కు M/F వర్కర్స్ కా॥భో+వసతి+జీతం 16-18 వేలు ఫోన్: 9133271122/ 9515119430 [SCA25004282]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీతం: 18k. Ph: 9640400073, 9160900024 [SCA25004117]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము